# కొత్త చిగుళ్ళు

వెంకటాపురం పేరు చెబితే శంకరం మాస్టారు గుర్తుకొస్తారు. అలాగే శంకరం మాస్టారు ప్రసక్తివస్తే చటుక్కున వెంకటాపురం తలపుకొస్తుంది. ఆయన ఎక్కడో పుట్టినా వూహావచ్చాక ఆ గ్రామాన్ని విడిచి ఎరగరు.

శంకరం మాస్టారు వూళ్ళో ఆబాల గోపాలానికి సన్నిహితులు. ఎవరికేసలహా కావాలన్నా పరుగెత్తుకు వస్తారు మాస్టారు దగ్గరికి. ఆయనతో కాసేపు మాట్లాడితే ఎంత బాధలోవున్న వారికైనా గుండె మీద బరువంతా దించినట్లవుతుంది. తన గుండెనిండా బాధలువున్నా చిరునవ్వుతో ఇతరుల బాధలు పంచుకునే దిట్టతనాన్ని దేవుడాయనకు ప్రసాదించాడు.

మాస్టారికి తీరుబాటు తక్కువ. స్కూలు, ప్రయివేట్లు అయ్యాక యింటిపని చూసుకుని సరాసరి వూరు చివరవున్న వంతెన దగ్గరకు వస్తారు. ఆ వంతెన, దానికి ప్రక్కనేవుండి వూరికి కాసలా కాస్తున్నట్లుండే మైలురాయి మాస్టారికి చిరకాల స్నేహితులు. కొన్ని సంవత్సరాలుగా మాస్టారికి మరొక క్రొత్త నేస్తం దొరికింది. మైలురాయికి ఎదురుగా కొద్దికాలంవరకు ఎర్రటి పూలతో కళకళలాడుతుండే మోదుగచెట్టు. ఇప్పుడది జీవంలేనిదానిలా మోడు పడిపోయింది. ఆ చెట్టునుచూస్తే మాస్టారికి జాలి వేస్తుంది. అంతేకాదు, ఆ చెట్టు కూడా తననిచూసి జాలిపడుతున్నట్లు మాస్టారు భావిస్తారు.

వంతెనమీద బాచినపీట వేసుకుని ఆ మైలురాయివంక, ఆ మోడువడిన చెట్టువంక చూస్తూ కూర్చుంటారు. గంభీరంగా కాలాన్ని ఎదిరించి, నిలబడే ఆ రాయి పట్నంనుంచి వెంకటాపురం పాతికమైళ్ళని లెక్కచూపుతుంది, మౌనముద్ర వహించిన గురువు ముఖంలోకి చూసే శిష్యుని మాదిరి శంకరం మాస్టారు ఆ మైలురాయిమీద రాసివున్న అంకెలవైపు తదేకంగా చూస్తుంటారు. వెంకటాపురానికి సరిహద్దు ఆ రాయే. తన జీవితపు హద్దుకూడా అదేనని మాస్టారు అనుకుంటారు. ఆయన సామాన్యంగా తన గురించి చెప్పేటప్పుడు ఆ మైలురాయి ప్రస్తావన వస్తుంది.

శంకరం మాస్టారి జీవితంలో ఆ మైలురాయి ప్రవేశించి ఎన్నో సంవత్సరాలయింది. దాన్ని ప్రవేశపెట్టింది ఆయన తండ్రి పరంధామయ్య.

అప్పటికి శంకరానికి పదిహేనేళ్ళు నిండలేదు. స్కూలు ఫైనలు చదువుతున్నాడు. తండ్రి ఆ వూళ్ళోనే ఉపాధ్యాయుడుగా పనిచేస్తుండేవాడు.

ఒక ఆదివారంనాడు శంకరం తండ్రితో వంతెన దగ్గరకు వచ్చాడు. అదే వంతెన, అదే మైలురాయి. ఇద్దరూ వంతెనమీద కూర్చున్నారు. పరంధామయ్య కొడుకు నుద్దేశించి 'శంకరం, అదేమిట్రా?' అని అడిగాడు మైలురాయిని చూపిస్తూ.

తండ్రివేసిన ప్రశ్నకు తడుముకోకుండా జవాబు చెప్పగలుగుతున్నందుకు పొంగిపోతూ 'మైలురాయి' అన్నాడు కంఠస్వరం పెంచి.

పరంధామయ్య వెంటనే రెండో ప్రశ్న వేశాడు. ఇంకా తేలికప్రశ్న వస్తుందని గట్టిగా నమ్ముతూ ఠకీమని సమాధానం చెప్పడానికి సిద్ధంగా కూర్చున్నాడు శంకరం. తండ్రి మరోప్రశ్న అడగటానికి ఎందుకంత తటపటాయిస్తున్నాడో అర్థం కాలేదు. ఇంతకాలంగా ఉపాధ్యాయుడుగా వుంటూ, పిల్లల్ని ప్రశ్నలతో వుక్కిరి బిక్కిరి చేసే తండ్రికి ప్రశ్నలే దొరకకపోవటం వింతగా తోచింది, లోకానుభవంలేని శంకరానికి.

ఆలోచనల మేఘాలమీద స్వారీచేసి వచ్చిన పరంధామయ్య మనస్సు ప్రశ్నల వర్షం కురిపించసాగింది.

'ఈ మైలురాయి అవతల ఏముందిరా?'

ఇది అర్థంలేని ప్రశ్నగా తోచింది శంకరానికి. అయినా జవాబు చెప్పాడు:

'ఫర్లాంగురాయి.'

పరంధామయ్య మళ్ళీ అడిగాడు:

'దాని తరువాత?'

'ఫర్లాంగురాళ్ళు, వాటి తరువాత మరో మైలురాయి. అలా పోతూనే వుంటాయి.'

తండ్రి వేయబోయే ప్రశ్నలకు ముందుగానే సమాధానం చెప్పగలిగానన్న తృప్తి కలిగింది శంకరానికి. పరంధామయ్యకు కూడా కొడుకు సమాధానాల తీరు నచ్చినట్లేవుంది. తాను చెప్పదలచుకున్న సంగతి కొడుక్కి అర్థమయ్యేటట్లు ఎలా చెప్పటమా అని కాసేపు ఆలోచించి, 'అవునా! - అంటే మన వూరు దాటిన తరువాత, ఎన్ని మైలురాళ్ళు వుంటాయో తెలుసురా?' అని ప్రశ్నించాడు.

తండ్రి యివ్వాళ మైలురాళ్ళమీద పట్టించడం శంకరానికి వింతగా వుంది. ఆ మైలురాళ్ళ లెక్కలన్నీ యీయన కెందుకో అన్న విసుగుకూడా కలుగుతోంది.

ఇంతలో చిన్న కారొకటి వంతెన మీదుగా బస్తీవైపు దూసుకుపోయింది. పిగిలిపిట్ట రంగులోవున్న ఆ కారు ఎంతో ముచ్చటగా వుంది. దాని వేగాన్ని, అది చేరపోయే బస్తీ అందాన్ని వూహించుకుంటూ తండ్రి ప్రశ్నను కొన్ని క్షణాలపాటు మరచిపోయాడు. కారు కనుచూపు దాటింది. హాయిగా ఎగురుతూ నీలి మేఘంలో కలిసిపోయే పక్షిమాదిరి ఆ కారు దూరంగా ఆకాశం నేలపైకి వంగి వున్నట్లు కనుపించే క్షితిజరేఖలోకి మాయమయింది. దాని అవతల ఏముందోనని శంకరం ఆలోచిస్తున్నాడు. బస్తీ చాలా బావుంటుంది. తానుకూడా త్వరలో బస్తీకి వెళ్ళాలిగా పైచదువులకోసం! శంకరం మనస్సు దూదిపింజలా పైకి ఎగిరిపోతోంది.

పరంధామయ్య నస్యం పట్టుపడుతూ గట్టిగా ఎగపీల్చాడు. ఆ చప్పుడు శంకరానికి తండ్రివేసిన ప్రశ్నను గుర్తుచేసింది.

'చాలావుంటాయి నాన్నా?' అన్నాడు వులిక్కిపడినట్లు.

"అంటే ఎన్ని?"

'లెక్కలేనన్ని. ఎందుకంటే, బస్తీ వరకు పాతిక. అక్కడ్నుంచి ఢిల్లీ, కలకత్తా బొంబాయి యింకా అలా పోతూనేవుంటాయి యీ రోడ్లు.'

'ఎంతవరకు?'

'హిమాలయ పర్వతాలవరకు.' తండ్రి మరోప్రశ్న వేయటానికి ఆస్కారం లేదని శంకరం భావించాడు.

కాని పరంధామయ్య వూరుకోలేదు.

'అంతవరకేనా?'

శంకరం చిన్న షాక్ తిన్నాడు. తండ్రి బలే దిట్టమైన వాడనిపించింది. తను మాత్రం తక్కువవాడా?

చరిత్ర పాఠాలు గుర్తుకొచ్చాయి.

తెల్లని మంచుకొండలు, వాటిమధ్య కనుమలు చూపే చిత్రం కంటికి కట్టినట్లయింది. జవాబు దొరికింది.

'కాదు నాన్నా! అక్కడ్నుంచి కైబరుకనుమగుండా విదేశాలకు పోతుంది.'

'అంటే ఏమన్నమాట?' గంభీరంగా అడిగాడు.

'ఈ రోడ్డువెంట వెడితే ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్ళొచ్చు.'

తనకు కావలసిన సమాధానం వచ్చినందుకు పరంధామయ్యకు సంతోషం కలిగించింది.

'అంటే, యీ కనుపిస్తున్న మైలురాయి దాటిన తరువాత విశాలమైన ప్రపంచం వున్నదన్నమాట... తెలిసిందా?'

'ఆఁ తెలిసింది.'

'చూడు శంకరం! నువ్వు పెద్దవాడి వయ్యాక ఏంచేద్దామనుకుంటున్నావురా?' పరంధామయ్య కళ్ళు భవిష్యత్తులోకి తొంగిచూశాయి.

నిజం చెప్పాలంటే శంకరానికి ఆలోచనలు మెండు. మనస్సులో మేడలు కట్టుకోవడంలో మంచి వుత్సాహం వున్నవాడు. వెంకటాపురానికి తహసీల్దారు, కలెక్టరు వచ్చినప్పుడు చూసి తానుకూడా ఆ దుస్తుల్లో వున్నట్లు కలలు కనేవాడు. తహసీల్దారుకన్నా శంకరానికి కలక్టరే నచ్చాడు. దర్జాగా వుంటాడు. స్కూలుకు అప్పుడప్పుడు వచ్చే ఇన్‌స్పెక్టరు, డి.ఇ.ఓ కూడా ఒకసారి మెదిలారు అతని తలపుల్లో. వాళ్ళకు పాత పాఠాలు తప్ప మరో గొడవ లేదు. అదీగాక వాళ్ళలో ఠీవి తక్కువ. పాతకోట్లు, పంచకట్లు... శంకరం అన్నీ ఆలోచించాడు.

'చదువుకుని కలెక్టరవుతాను నాన్నా!' అన్నాడు.

ఆ మాటలు వినగానే పరంధామయ్య కళ్ళు ఆనందంతో మెరిశాయి. గుండె ఉవ్వెత్తుగా పొంగింది. ఇంతలోనే లోకమంతా పెద్దపెట్టున నవ్వినట్లయింది.

'పంతులు పరంధామయ్య కొడుకు కలెక్టరవుతాడా!' అని ఎన్నోగొంతులు కఠోరంగా హేళన చేస్తున్నట్లనిపించింది.

పరంధామయ్య కలవరపడ్డాడు. తండ్రి కలవరపాటుకు కారణం కనుపించలేదు శంకరానికి. తన సమాధానం తండ్రికి నచ్చలేదేమోనన్న సందేహం కలిగింది.

'పోనీ తహసీల్దారు చేస్తా నాన్నా!' అన్నాడు తన ఉద్యోగపు కోరిక తగ్గించుకుంటూ.

పరంధామయ్య తెప్పరిల్లి, తనకంటె తన కొడుకే విజ్ఞుడని గ్రహించాడు. 'అలాకాదు... కలెక్టర్ చెయ్యి. నీకు ఏ ఉద్యోగం చేయాలనివుంటే అదే చేద్దువుగాని. అసలడిగా వూరికే నీ వుద్దేశం తెలుసుకుందామని' అన్నాడు చిరునవ్వుతో.

శంకరం ముఖం సంతోషంతో విప్పారింది. వెలుగురేఖ చొచ్చుకురావడంతో నల్ల మబ్బుల బెడద తీరిపోయినట్లు అతని మనస్సులోని ఆందోళనలన్నీ అదృశ్యమయ్యాయి.

'చూడు శంకరం! ఒక్క సంగతి గుర్తుంచుకో. ఆ మైలురాయి వుంది చూశావ్... దీనిని దాటి పోదామని ప్రయత్నించి వెళ్ళలేకపోయాను. ఇప్పుడు నువ్వు చెప్పినట్లు ఈ మైలురాయి తరువాత పెద్ద ప్రపంచం వుంది. అందులోకి వెళ్తే నీవు పైకి పెరగడం ప్రారంభిస్తావ్. కలక్టరేకాదు. ఇంకా పెద్దవాడి వవుతావు. ముందుగా యీ మైలురాయి దాటిపోవాలి. దీని లోపలేవుంటే ఎదుగూ బొదుగూ వుండదు నాకుమల్లే.' పరంధామయ్య కంఠం రుద్ధమయింది. కొడుక్కి తెలియనీయకుండా సంబాళించుకున్నాడు.

'బాగా చదువుకుని బస్తీలో పెద్ద వుద్యోగం చేస్తా నాన్నా!' అన్నాడు శంకరం ఒక నిర్ణయానికి వచ్చినవాడి మాదిరి.

పరంధామయ్య మనస్సు పరవళ్ళు తొక్కింది.

ఇద్దరూ ఇంటిముఖం పట్టారు...

మైలురాయి చూసినప్పుడల్లా శంకరం మాస్టారికి ఈ వుదంతం స్మరణకొస్తుంది. మైలురాయి మీదవున్న అంకెలు అక్షరాలు తననూ, తాను కట్టుకున్న గాలి మేడలనూ చూసి అపహసిస్తున్నట్లు తోస్తుంది. నిజంగా తన బ్రతుకు అలాంటిదే. ఏ కలెక్టరో అవుదామనుకున్న తాను అదే వెంకటాపురంలో, అదే మైలురాయి హద్దులోపల, అదే బడిలో పంతులుగా పనిచేయడం గమనించిన మైలురాయి మోర పైకెత్తి పెద్ద పెట్టున వికటంగా నవ్వితే అది దాని తప్పుకాదు. విధీ, గిధీ లేదని వాదించేవారికి తన జీవితం ఎదురులేని సమాధానం. విధికాకపోతే మరేమిటి?–

శంకరం స్కూలుఫైనలు ప్యాసయినట్లు పేపర్లో ఫలితాలొచ్చాయి. తన కొడుకు అప్పుడే పెద్ద పదవిలోకి ఎగిరి గంతేసినట్లు సంబరపడ్డాడు పరంధామయ్య. శంకరానికికూడా చాలా సంతోషం కలిగింది. తాను ఎంతో పైకి ఎదిగినట్లు అనిపించింది.

సెలవలు అయిపోగానే పెద్ద చదువులకు బస్తీ వెళ్ళాలి. బస్తీ ఎంత అందంగా వుంటుందో! మధ్య మధ్య సెలవులకు వెంకటాపురం రావచ్చు. కలలపైన తేలి పోతున్నాడు శంకరం. కొడుకును కాలేజీలో ప్రవేశపెట్టడానికి పరంధామయ్య గట్టిగా ప్రయత్నం చేస్తున్నాడు.

అయితే వున్నట్టుండి పరంధామయ్యకు జబ్బు ముంచుకొచ్చింది. డాక్టరు పరీక్షించి, పక్షవాతంలోకి దింపే సూచనలున్నాయని చెప్పాడు. అంతపనీ అయింది. ఒక కాలు చేయి పట్టుతప్పాయి. పరంధామయ్య మంచాన పడ్డాడు.

ఇక కుటుంబాన్ని నడపవలసింది శంకరం. పాత పెంకుటిల్లు తప్ప సొంత ఆస్తి అంటూ వేరేలేదు. పోతే, పరంధామయ్య ఆర్జించుకున్న మంచిపేరుమాత్రం వుంది. నోరు మంచిదయితే వూరు మంచిదవుతుందంటారు.

శంకరాన్ని పిలిచాడు తండ్రి. వచ్చి పక్కన కూర్చున్నాడు. దిగులు ఇద్దరి గుండెలపైనా కూర్చుంది గుడ్లగూబలాగా.

నిన్న మొన్నటివరకూ పగ్గాలకు అందని ఆనందంతో గంతులువేసే శంకరం ముఖంలో అది ఛాయగానన్నా లేదు. కొడుకు ముఖంచూసి కుమిలిపోయాడు పరంధామయ్య. కాని, తాను ఏం చేయగలడు? నిస్సహాయుడు.

లేని గాంభీర్యాన్ని తెచ్చుకుని 'శంకరం! ఇవ్వాళ వుదయం పెద నాయుడుగారు కబురుచేశారు. ఒకసారి నిన్ను పంపమన్నారు. వెళ్ళిరా' అన్నాడు.

తాను బ్రతికి వుండగానే కొడుకు ఇటువంటి దశకు రావటం పరంధామయ్య గుండెను చెరువు చేసింది. కొడుకు బయటకు వెళ్ళాక పరంధామయ్య కన్నీరు మున్నీరుగా విలపించాడు. నిస్సహాయులకు వూరటనిచ్చేది కన్నీరే.

శంకరం యింటి పరిస్థితులను అర్థం చేసుకున్నాడు. పగటి కలలవల్ల ప్రయోజనం లేదని నిశ్చయించుకున్నాడు. తండ్రి చెప్పిన ప్రకారం పెదనాయుడు గారింటికి వెళ్ళాడు. పెదనాయుడుగారి పూర్వీకుల నుంచీ పరంధామయ్య కుటుంబం పట్ల ఆదరాభిమానాలు చూపుతూ వస్తున్నారు. కష్టాలలో ఆదుకుంటున్నారు. అడగకుండానే సహాయపడుతూ వుదారత చూపుతున్నారు.

బిక్కుబిక్కుమంటూ వెళ్ళి చేతులు కట్టుకుని ఎదుట నిలబడ్డ శంకరాన్ని చూడగానే పెదనాయుడుగారి కళ్ళు చెమర్చాయి.

'రా, కూర్చోబాబూ!' అన్నాడు మానవత్వపు విలువలు తెలుసుకున్న వేదాంతి మాదిరి.

దేవుడన్నిచోట్లా వున్నాడని ప్రహ్లాదుడన్నాడు. పెదనాయుడుగారిలో మాత్రం తప్పక వున్నాడని శంకరం అనుకున్నాడు.

'బాబూ! నీ గురించి హెడ్మాస్టరుగారితో సంప్రదించాను. ఇప్పటి పరిస్థితుల్లో టీచరు ట్రయినింగు పూర్తిచేస్తే మంచిదని సలహా యిచ్చారు. మీ నాన్నగారి వుద్దేశం కూడా అదే. ఏమంటావ్?' అడిగారు.

'సరేనండి' అన్నాడు శంకరం.

'మంచిది. అన్ని ఏర్పాట్లు నే చేస్తానని నాన్నగారితో చెప్పు.'

నమస్కారం చేసి శంకరం సెలవు తీసుకున్నాడు.

పెదనాయుడుగారి దయవల్ల శంకరం ట్రయినింగు పూర్తిచేసి బడిపంతులయ్యాడు.

సంవత్సరాలు దొర్లిపోయాయి.

పరంధామయ్యతరం గడిచిపోయింది.

శంకరం మాస్టారికొడుకు గోపాలం చురుకైనవాడు. చదువు బాగా అబ్బుతోంది. శంకరం మాస్టారు మొదట్లో ప్రయివేటు పరీక్షలకు కట్టి పట్టం పొందాలని ప్రయత్నించారు. కాని సంసార సమస్యల్లో తీరుబాటు దొరకక విరమించుకున్నారు. తాను కూపస్థ జీవితం గడపక తప్పదని నిర్ధారణ చేసుకున్నారు.

అందుచేతనే మైలురాయికి ఎదురుగా వున్న చెట్టుమ్రోడు పడిపోతుండడం గమనించిన శంకరం మాష్టారు అది తన జీవితానికి భాష్యం చెబుతున్నట్లు భావించుకున్నారు.

ఇప్పుడు శంకరం మాస్టారి ఆశలన్నీ గోపాలం పైననే. అతడు వెంకటాపురం పొలిమేరదాటి బస్తీలో అడుగు పెట్టాలని, కాలేజీలో చదివి పట్టం పొంది పెద్ద పదవి అలంకరించాలని, తన కలలు నిజం చేయాలని మాస్టారి కోరిక.

గోపాలం స్కూలుపైనలుకు వచ్చాడు. కష్టపడి చదువుతున్నాడు.

ఒకనాటి సాయంత్రం శంకరం మాస్టారు, గోపాలం వంతెనమీద కూర్చుని రాబోయే పెద్ద పరీక్షలగురించి మాట్లాడుకుంటున్నారు. మాస్టారికి తన చిన్నతనంలో తండ్రివేసిన ప్రశ్నలు గోపాలాన్ని వేయదలచుకోలేదు.

శంకరం మాస్టారు ఎదురుగావున్న మోదుగచెట్టువంక తదేకంగా చూస్తున్నారు అలవాటుచొప్పున. తన కళ్ళను తానే నమ్మలేకపోయారాయన.

చకచకా వెళ్ళి ఆ మోడును పరిశీలించారు. ఆశ్చర్యం! ఆమోడు ఇంతకాలానికి తిరిగి చిగురుపట్టింది. చెప్పరాని ఆనందం పొందారు మాస్టారు. గబగబా గోపాలం దగ్గరకువచ్చి ఆ చెట్టు చిగురువేస్తున్న సంగతి చెప్పారు. అతనికి అందులో వింతేమిటో అర్థంకాక విని వూరుకున్నాడు.

శంకరం మాస్టారి ఆలోచనలకు రెక్కలొచ్చాయి. గోపాలం పెద్ద పరీక్షలకు హాజరయ్యాడు. అన్నీ చాలా బాగా రాశాడు.

పెదనాయుడుగారి కొడుకు చిననాయుడు ఇదివరకే మాట యిచ్చాడు - గోపాలం కాలేజీ చదువుగురించి దిగులుపడనవసరంలేదని.

అనుకున్నట్లే గోపాలం పరీక్షలో ప్యాసయ్యాడు. ఫలితాలుపడ్డ పత్రికపట్టుకుని పెన్నిధి దొరికినట్లు నాయుడుగారింటికి వెళ్ళారు శంకరం మాస్టారు. ఇంటిల్లిపాది యీ శుభవార్త విని సంతోషించారు. గోపాలం తెలివితేటలను మెచ్చుకున్నారు. అతని కాలేజీ చదువుకు సహాయం చేస్తానని చిననాయుడు మరోసారి ధైర్యం చెప్పారు.

శంకరం మాస్టారు అన్ని ఏర్పాట్లు చేశారు. చిననాయుడి సహాయంతో గోపాలం కాలేజీలో చేరాడు. వెంకటాపురం హద్దులు దాటి గోపాలం బస్తీ చేరుకున్నాడు.

మైలురాయి ఎదురుగావున్న మోదుగచెట్టు తిరిగి రెమ్మలు తొడిగింది. శంకరం మాస్టారి జీవితంలో గోపాలం ద్వారా క్రొత్త వెలుగులు ప్రసరించాయి. గోపాలం పెద్ద పదవి అందుకుంటాడని, అందుకోవాలని శంకరం మాస్టారు రేయింబవళ్ళు తలపోస్తుంటారు.

*('జయశ్రీ' - డిసెంబర్, 1963)*